క్లుప్తంగా

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద



మాచర్ల: దేశవ్యాప్తంగా యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద ఆధ్వర్యంలో రామకృష్ణ మిషన్ స్థాపించి 125వ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆయా పాఠశాలల్లో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో పోటీలలో విజేతలైన బాలబాలికలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంతరావు, రిటైర్డ్ హెచ్ఎం ముత్యాల పాపిరెడ్డి, సేవా సమితి సభ్యులు లాలుసాహెబ్, రవి, శ్రీను, స్కూల్ డైరెక్టర్ శ్రీధర్, శివ పాల్గొన్నారు.

వరి పంట కోత ప్రయోగం



మాచవరం: మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా వరి పంట కోత ప్రయోగం బుధవారం చేపట్టారు. గ్రామానికి చెందిన కామిరెడ్డి అంజిరెడ్డి పొలంలో 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పంటకోసి నూర్పిడి చేయగా 16 కిలోల 890 గ్రాముల దిగుబడి వచ్చింది. ఎకరాకు సుమారు 36 బస్తాల దిగుబడి రావచ్చని అంచనా వేశారు. గ్రామ ఉద్యాన సహాయకులు నరసింహానాయక్, యూబీఐ ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధి కిరణ్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మాచవరం: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మోర్జంపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బత్తుల పిచ్చయ్య (48) తన నివాసం పక్కనే పశువులకు రేకుల షెడ్డు నిర్మించాడు. ఉదయాన్నే పశువులకు మేత వేసేందుకు షెడ్డులోకి వెళ్లాడు. షెడ్డులో ఉన్న ఇనుప పైపును పట్టుకోగా విద్యుత్ షాక్ తగిలింది. కరెంట్ సర్వీస్ వైర్ తెగి ఇనుప రేకులకు అంటుకోవడంతో విద్యుత్ సరఫరాతో షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

31లోపు ఆస్తి, నీటిపన్నులు చెల్లించండి



మాచర్ల: పట్టణంలో ఆస్తి, నీటి పన్నులు ఈ నెల 31వ తేదీలోపు చెల్లించాలని, అప్పటి వరకు ఎటువంటి అపరాధ రుసుముతో పనిలేకుండా అర్థ సంవత్సరానికి సంబంధించి పన్నులు తీసుకోబడతాయనే విషయాన్ని పట్టణానికి చెందిన ప్రతి ఒక్కరూ గమనించాలని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఆస్తి, నీటి పన్నులు తప్పనిసరిగా 2022–23కు సంబంధించి అర్థసంవత్సరం పన్నులను ఈనెల 31లోపు చెల్లించాలన్నారు. అదే విధంగా పాత బకాయిలు ఉన్న వారికి ఈ విధానం వర్తించదని, వారు తప్పనిసరిగా పురపాలక సంఘ నిబంధనల ప్రకారం వడ్డీతో సహా పన్నులు చెల్లించాలన్నారు. ఈ విషయాన్ని గమనించి వెంటనే పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

పంట నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం చేస్తాం

రాజుపాలెం: తుఫాన్ వలన పంటలు నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని, తగిన న్యాయం చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. నకరికల్లు మండలంలోని చల్లగుండ్ల, దేచవరం గ్రామాలలో తుఫాన్ వలన నష్టపోయిన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. శనగ, కంది పంటలను పరిశీలించి 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి రైతులతో మాట్లాడుతూ నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు. శనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ శనగ విత్తనాలను రాయతీపై పంపిణీ చేస్తారని తెలిపారు. ఎన్యూమరేషన్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, దేచవరం ఉప సర్పంచ్ రమణారెడ్డి, వీఆర్వో యువరాజు, వ్యవసాయ సహాయకులు దిలీప్‌కుమార్, కె.రవిబాబు, రైతులు ఉన్నారు.

ఆటో బోల్తా ఒకరికి తీవ్ర గాయాలు

నార్నెపాడు(ముప్పాళ్ళ): ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని నార్నెపాడు సమీపంలో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్నెపాడుకు చెందిన నలుగురు యువకులు ఆటోలో ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామానికి వెళ్లి వస్తుండగా నార్నెపాడు గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఆటోలో ఉన్న పిల్లి అనిల్‌కుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.



పిడుగురాళ్ల పట్టణంలోని చెరువు వద్ద పొగమంచు





పిడుగురాళ్ల పట్టణంలోని మెయిన్ రోడ్డు మంచుతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని దృశ్యం

మంచు దుప్పటిలో
లైమ్‌సిటీ

లైమ్ సిటీని మంచు కప్పి పడేసింది. ఉదయం 9 గంటల వరకు మంచు తుప్పర్లు కప్పి పడేశాయి. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించక వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ఉదయం సమయంలో పట్టణంలోని చెరువు కట్టపై వాకింగ్ చేసే వారు సైతం మంచుతో అల్లాడిపోయారు.

– పిడుగురాళ్ల

త్వరలో పల్నాడు నడిబొడ్డున సామాజిక దేవాలయం ప్రారంభం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: పల్నాడు నడిబొడ్డులో సామాజిక దేవాలయంలో హాస్పిటల్‌ను త్వరలో ప్రారంభించుకోబోతున్నామని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామ శివారులోని బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ, వైద్యశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. దానికంటే ముందు త్వరలో ప్రారంభం కాబోతున్న వైద్యశాలకు సంబంధించిన బ్లాక్‌ను, ఎమర్జెన్సీ బ్లాక్, జనరల్ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా అతి పెద్ద కట్టడం పిడుగురాళ్లలో నిర్మించుకుంటున్నామని తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం 50 ఎకరాల విస్తీరణంలో నిర్మాణం మొదలు పెట్టామన్నారు. మరో నెలలో మొదటి దశలో హాస్పిటల్ నిర్మాణాన్ని పూర్తి చేసుకొని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించ బోతున్నామన్నారు. సుమారు 600 పడకల హాస్పిటల్‌లో కాలి నొప్పి నుంచి క్యాన్సర్, గుండె నొప్పి వంటి వ్యాధులకు కూడా వైద్య చికిత్స అందించటం జరుగుతుందన్నారు. మొదటి దశలో రూ.160 కోట్లతో లక్ష చదరపు గజాల్లో 150 పడకల వైద్యశాల నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. మిగిలిన వైద్యశాల 2024 నవంబర్ కల్లా పూర్తిగా పేద ప్రజలకు అందుబాటులోకి రానుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ చిట్టిబాబు, ఈఈ రమణ, డీఈ భాస్కర్‌రావు, మెగా చీఫ్ జనరల్ మేనేజర్ లక్ష్మణ్‌రెడ్డి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, దాచేపల్లి మున్సిపల్ చైర్మన్ కొప్పుల సాంబయ్య, దాచేపల్లి జెడ్పీటీసీ మూలగుండ్ల ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్‌లు షేక్ నాగూర్‌బి, ముప్పూరి వెంకట రమణ, గొళ్ల వెంకటరమణ, మాజీ సర్పంచ్ బండి రామిరెడ్డి, యర్రంరెడ్డి చంద్రారెడ్డి, బండి అంజిరెడ్డి, ఎంపీటీసీలు మట్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.



వైద్యశాల బ్లూ ప్రింట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

చిరువ్యాపారులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

దాచేపల్లి : ఫ్రూట్ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని, ఫ్రూట్ మార్కెట్ దాచేపల్లికి మణిహారం కాబోతుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లిలోని సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను తొలగించి రూ.30 లక్షలతో నిర్మించిన తారురోడ్డు పక్కన పెట్టిన తోపుడు బండ్లను ఆయన బుధవారం పరిశీలించి చిరువ్యాపారులతో మాట్లాడారు. అద్దంకి–నార్కెట్‌పల్లి హైవే పక్కనే ఉన్న ఈ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని, ఒక్కొక్కరికి సుమారు రూ.4 లక్షలు విలువ చేసే సెంటు స్థలం కేటాయించామని చెప్పారు. తాత్కాలికంగా చిరువ్యాపారులకు ఇక్కడ ఇబ్బందులు ఉన్నా సహకరించాలని, మార్కెట్‌లో అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. రూ.2 కోట్లతో నాగులేరుపై లోలెవల్ చప్టా నిర్మాణం చేపడతామని,

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సర్వీస్ రోడ్డులో తోపుడు బండ్లను వేరే చోటికి తరలించామని, చిరువ్యాపారులు అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. చిరువ్యాపారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, మార్కెట్‌కు వచ్చేందుకు మెట్లను నిర్మించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దాచేపల్లి అభివృద్ధిలో భాగంగా రోడ్లను విస్తరిస్తున్నామని, కొంత ఇబ్బంది ఉన్నా అధైర్యపడవద్దని, అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయన్నారు. ఆయన వెంట నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ ఉన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరించాలి



మాచర్ల: ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించి దేవుని సేవలో తోటి వారిని ప్రేమిస్తూ ముందుకెళ్లాలని మాజీ మున్సిపల్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి బోయ రఘురామిరెడ్డి అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో బుధవారం నిర్వహించిన మరనాత విశ్వాస సమాజ చర్చిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ డిసెంబర్ నెలలో క్రైస్తవులు ఏసు క్రీస్తును స్తుతిస్తూ ఆరాధన, ఉపవాస ప్రార్థనలు నిర్వహించటం జరుగుతుందన్నారు. అందులో భాగంగా తనను 25వ వార్డులోని మరనాత విశ్వాస సమాజ చర్చిలో పాస్టర్ ఎలీసాతో పాటు క్రైస్తవ పెద్దలు ఆహ్వానించి సెమీక్రిస్మ స్ వేడుకలలో పాల్గొనేందుకు అవకాశం కల్పించటం ఎంతో ఆనందకరమని, దేవుని సన్నిధిలో పాల్గొని ప్రభు సేవలో పునీతులు కావటం సంతోషకరమన్నారు. పాస్టర్ వై.ఎలీసా, పాస్టర్లు అంజి, దానియే లు, సంఘ పెద్దలు చెన్నయ్య, నాగమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచి జరగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి

విజయవంతంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

వెల్దుర్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య అన్నారు. బుధవారం మండలంలోని శిరిగిరిపాడు–2 గ్రామ సచివాలయ పరిధిలోని పాపిరెడ్డికుంటతండా, వజ్రాలపాడుతండా, సేవానాయక్‌తండా, దావుపల్లి, బొటుకులపాయ తండాలలో జరిగిన రాష్ట్రానికి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చి గిరిజనుల అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని 87 శాతం గృహాలకు అభివృద్ధి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బడుగు బలహీన వర్గాల ప్రజలు మద్దతుగా నిలిచి మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ముందుగా సచివాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ జెండాను, అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించి గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, ఎంపీపీ చింతా శివరామయ్య, జెడ్పీటీసీ రూప్లీబాలునాయక్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మేకల కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోట్ల పాపిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ బొజ్జా అంజిబాబు, గ్రామ సర్పంచ్ చపారపు లచ్చిరెడ్డి, ఎంపీటీసీ ఈగల అయ్యన్న, శిరిగిరిపాడు–2 ఎంపీటీసీ బోడిబాయి, నాయకులు చింతా ఆదినారాయణ, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగాల రాఘవాచారి, తాళ్ల నారాయణరెడ్డి, చిర్రా మల్లారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ నాగరాజు, గాలి మరియదాసు, సిమోను, శంకర్, రమావత్ బాలునాయక్, అంజినాయక్, నాగేశ్వరరావునాయక్, చిన్నినాయక్, లక్ష్మానాయక్, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి


రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 28వ వార్డులో కౌన్సిలర్ షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. వార్డులోని ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్‌లు ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ నవరత్నాల పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతి వార్డు నుంచి నియోజకవర్గ స్థాయిలో పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజాప్రతినిధులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల స్థాయి మైనార్టీ నేతలు షేక్ అన్వర్‌బాషా, సులేమాన్, దరియా, చిన్న భద్రు, బేకరీ సుభాని, ట్రాక్టర్ కరీముల్లా, హుస్సేన్, నాగుల్‌మీరా, కౌన్సిలర్ షేక్ సుభాని, కార్యకర్తలు, అభిమానులు, మైనార్టీ నాయకులు నాసర్, మీరా, గౌస్ పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఉత్సవ శోభతో కళకళలాడుతున్న వీరుల గుడి



ఉత్సవ ప్రాంగణం



చాపకూడు మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ జయకుమార్

కారెంపూడి: పల్నాటి వీరుల గుడి ప్రాంగణం ఉత్సవ శోభతో కళకళలాడుతోంది. ప్రజలు తరలి వచ్చి వీరుల గుడిలో కొలువుదీరిన పల్నాటి వీరుల ఆయుధాలకు పూజలు చేస్తున్నారు. గుడి ప్రాంగణంలోని వివిధ రకాల వినోద కార్యక్రమాలను చూసి ఆనందిస్తున్నారు. అలాగే వివిధ రకాల స్టాల్స్‌ను తిలకించి తమకు అవసరమైనవి కొనుగోలు చేస్తున్నారు. రంగుల రాట్నాలు ఎక్కి పిల్లలు బాగా ఆనందిస్తున్నారు. ఇదిలా ఉంటే గురువారం జరగనున్న బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతం అమలుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. చాపకూడు మండపాన్ని సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు పరిశీలించారు. మరోవైపు పల్నాటి వీరాచారవంతులు ఇంకా రణక్షేత్రానికి తరలివస్తూనే ఉన్నారు. తరలివచ్చిన వారు బుధవారం రాత్రి నాగులేరు ఒడ్డున వీరుల ఆయుధాలను శుభ్రం చేసుకుని పూజ కట్టుకోవడం కన్పించింది. గురువారం కూడా వీరాచారవంతులు ఎక్కువగా తరలి వస్తారని వీరుల గుడి పూజారులు చెబుతున్నారు. వీరుల గుడి చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లి దేవాలయాలు విద్యుత్ వెలుగులతో మెరిసిపోతున్నాయి.



ఆయుధాలతో గ్రామోత్సవానికి బయలుదేరిన పల్నాటి వీరాచారవంతులు

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం

సత్తెనపల్లి: ప్రాణాంతక ఎయిడ్స్/హెచ్ఐవీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ పిలుపునిచ్చారు. సత్తెనపల్లి మండలం పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపీ ఎస్ఏసీఎస్, చైల్డ్ ఫండ్ ఇండియా వారి ఆధ్వర్యంలో లింక్ వర్కర్స్ స్కీం కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్ గురించి లింక్ వర్కర్స్ స్కీం పనిచేస్తుందని, గ్రామాల్లో హైరిస్క్ వారిని గుర్తించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావడం? వారికి పరీక్షలు నిర్వహించి హెచ్ఐవీ స్టేటస్ గుర్తించి తక్షణమే మందులు ఇప్పించడం వలన వారి జీవితకాలాన్ని పెంచవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం మంచిదని, ఇది ప్రజలకు చాలా ఉపయోగపడుతుందన్నారు. దీనికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. జోన్–2 సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో హైరిస్క్ వారిని గుర్తించి వారికి హెచ్ఐవీపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. లింక్ వర్కర్స్ స్కీం అనేది గ్రామ స్థాయిలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన, వివక్షతల గురించి పనిచేస్తుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే హెచ్ఐవీ ఎక్కువగా ఉందని, గుంటూరు జిల్లాలో లింక్ వర్కర్ స్కీం 100 గ్రామాల్లో పని చేస్తుందన్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయితేజరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టడానికి వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. హైరిస్క్ వర్గాల వారికి ప్రీ–ఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్ ఔషధాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, సీహెచ్ఓ వి.సీతారావమ్మ, ఎంపీహెచ్ఈవో పిట్టల శ్రీనివాసరావు, ఎల్‌టీ అనిల్, లింక్ వర్కర్ అరుణ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోన్–2 సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు

సబ్ ట్రెజరీ కార్యాలయం సందర్శన

మాచర్ల: రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పునరుద్ధరణలో భాగంగా పల్నాడు జిల్లాలో నూతనంగా నరసరావుపేట కేంద్రంగా సబ్ ట్రెజరీ డీడీ కార్యాలయం ఏర్పాటు చేయటం జరిగిందని పల్నాడు జిల్లా ట్రెజరీ అకౌంట్ ఆఫీసర్ వి.స్వామినాథన్ తెలిపారు. బుధవారం మాచర్ల పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. 2021 నుంచి 2023 డిసెంబర్ వరకు ఆర్థిక లావాదేవీలపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది సబ్ ట్రెజరీ కార్యాలయానికి సంబంధించి ఆర్థిక లావాదేవీల వివరాలు పరిశీలించటం జరుగుతుందన్నారు. అందులో భాగంగా స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని తనిఖీ చేయగా రికార్డులు సక్రమంగా ఉన్నాయన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో పెన్షన్‌లు, లైఫ్ సర్టిఫికెట్‌లు తప్పనిసరిగా సబ్ ట్రెజరీలో అందించాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన సమయానికి లైఫ్ సర్టిఫికెట్‌లు నమోదు చేసుకొని ఎటువంటి ఇబ్బందులు పడకుండా పింఛన్‌దారులు చూసుకోవాలన్నారు. ప్రభుత్వం సబ్ ట్రెజరీల ద్వారా వివిధ వర్గాలకు అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సబ్ ట్రెజరీ అధికారి కేతావత్ రామానాయక్, పల్నాడు జిల్లా క్యాంప్ క్లర్క్ రబ్బాని తదితరులున్నారు.



సబ్ ట్రెజరీ కార్యాలయంలో పల్నాడు జిల్లా ట్రెజరీ అకౌంట్ ఆఫీసర్ స్వామినాథన్


నాగన్నకుంటలో దీపోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని 22వ వార్డు నాగన్నకుంటలో వేంచేసి ఉన్న కార్య సిద్ధి ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసం అమావాస్య సందర్భంగా మంగళవారం రాత్రి దీపోత్సవం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామ, ఆంజనేయస్వామి భజన బృందం వారు భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారి దీపోత్సవంలో 500 మంది మహిళలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారని ఆలయ పండితులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన రావిక్రింది మల్లికార్జునరావు, రామారావు, దుర్గారావు, కాసాని శ్రీనివాసరావు, 22వ వార్డు కౌన్సిలర్ శెట్టి ఆనంద్ కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

బాలబాట ద్వారా విద్యా సేవలు

సత్తెనపల్లి: ఎంతోమంది పేద విద్యార్థులకు బాలబాట ద్వారా విద్యాపరంగా ఎన్నో సేవలు అందిస్తున్నామని కార్ప్స్ సంస్థ ప్రకాశం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో ఉత్తమ బాల ఉపాధ్యాయులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి సత్తెనపల్లి ఏరియా కోఆర్డినేటర్ జి.రవి అధ్యక్షత వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ చదువు ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, పిల్లలు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు మాట్లాడుతూ గత 23 సంవత్సరాల నుంచి బాలల విద్యాభివృద్ధికి బాలబాటలు పనిచేస్తున్నాయని, ప్రతి ఏడాది పేద విద్యార్థులను గురుకులాల్లో చేర్పించడం ద్వారా వారికి మెరుగైన విద్య అందుతుందన్నారు. అనంతరం ఉత్తమ బాల ఉపాధ్యాయులకు ప్రకాశం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

బొల్లవరంలో ఫ్యామిలీ డాక్టర్



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ పాల్గొని 87 మందికి వైద్యసేవలందించారు. వీరిలో17 మందికి సాధారణ పరీక్షలు, 37 మందికి బీపీ పరీక్షలు, 24 మందికి షుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు, బాలింతలకు అవసరమైన వ్యాక్సిన్‌లను అందించారు. అనంతరం అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారికి అవసరమైన వైద్య సేవలందించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ కె.రవితేజ, ఎంపీహెచ్ఏ మస్తాన్‌రావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.